క్లుప్తంగా

డాక్టర్ పసుపులేటికి సాహిత్య అవార్డు



డాక్టర్ పసుపులేటి హరిరామ ప్రసాద్

బాలాజీచెరువు: పీఆర్ డిగ్రీ కళాశాల హిందీ విభాగాధిపతి డాక్టర్ పసుపులేటి హరిరామప్రసాద్‌కు ముంబై హిందీ అకాడమీ సాహిత్య అవార్డు ప్రదానం చేసింది. ఆంధ్ర సంస్కృతిపై రామాయణ ప్రభావం అనే సిద్ధాంత వ్యాసం రచించిన హరిరామప్రసాద్‌కు ఈ అవార్డును మహారాష్ట్ర హోంశాఖ మంత్రి కృపాశంకర్‌సింగ్, చైర్మన్ డాక్టర్ ప్రమోద్ పాండే ముంబైలో శనివారం ప్రదానం చేశారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి ఎంపికైన ఏకైక సిద్ధాంతంగా దీనిని గుర్తించారు. డాక్టర్ హరిరామప్రసాద్‌ను కళాశాల టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది అభినందించారు.

నేడు కాకరపర్తి అష్టావధానం

కాకినాడ కల్చరల్: స్థానిక విద్యుత్‌నగర్‌లోని చల్లా కల్యాణమండపంలో ఆదివారం ఉదయం 10 గంటలకు అస్వాదన సమితి ఆధ్వర్యంలో విశ్రాంత తెలుగు ఉపాధ్యాయులు కాకరపర్తి దుర్గాప్రసాద్ అష్టావధానం నిర్వహించనున్నట్టు సమితి కార్యదర్శి కె.గౌరినాయుడు తెలిపారు. సాహితీ ప్రియులందరూ హాజరు కావాలని ఆయన కోరారు.

వారాంతపు సెలవులు అమలు చేయాలి

కాకినాడ సిటీ: కార్మిక చట్టం ప్రకారం తమకు వారాంతపు సెలవులు అమలు చేయాలని నగరపాలక సంస్థ క్లీన్ ఆంధ్రప్రదేశ్ (క్లాప్) డ్రైవర్లు అధికారులను కోరారు. శనివారం జగన్నాథపురం వాహనాల యార్డులో ఆ యూనియన్ అధ్యక్షుడు ఎం.శివశంకర్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. కాంట్రాక్టు సంస్థ ప్రతినిధులు ఇచ్చిన హామీ ప్రకారం డ్రైవర్లకు గుర్తింపు కార్డులు, బీమా అమలు చేయాలన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ చెల్లింపు క్రమం తప్పకుండా చేయాలన్నారు. యూనియన్ నాయకులు పలివెల వీరబాబు, ఎం శివశంకర్, ఎస్అభి, టి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు గురజనాపల్లి విద్యార్థినులు



రగ్బీ క్రీడాకారిణులతో పీడీ నాగలింగేశ్వరరావు

కరప: రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు మండలం గురజనాపల్లిలోని పబ్బినీడి పాపారావు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినులు గుత్తుల కృష్ణతేజ, పలివెల సునంద తేజశ్రీ, ఎర్రా జ్యోతిచంద్రిక ఎంపికైనట్టు హెచ్ఎం బీఆర్‌వీ ప్రసాదరావు శనివారం తెలిపారు. కర్నూలులో ఆదివారం నుంచి ఈ నెల 31 వరకు రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలు జరుగుతాయన్నారు. స్కూల్ గేమ్స్ అండర్-17 విభాగంలో జిల్లా జట్టు తరఫున ఆడేందుకు వీరు శనివారం బయలుదేరి వెళ్లారన్నారు. విద్యార్థినులను, పీడీ నాగలింగేశ్వరరావును ఎంఈఓ కె.బుల్లికృష్ణవేణి, సర్పంచ్ ఎ.శ్రీనివాసరావు, విద్యాకమిటీ చైర్మన్ పబ్బినీడి వీరబాబు, స్టాఫ్ సెక్రటరీ ఐ.ప్రసాదరావు అభినందించారు.

షటిల్ బ్యాడ్మింటన్ స్టేడియం ప్రారంభం



స్టేడియం ప్రారంభ కార్యక్రమంలో డాక్టర్ సత్యనారాయణ తదితరులు

కాకినాడ రూరల్: స్థానిక వాకలపూడిలో శనివారం 'శ్రీ' షటిల్ బ్యాడ్మింటన్ స్టేడియంను శనివారం ప్రారంభించారు. డాక్టర్ అడ్డాల సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరై క్రీడలు దేహ, మానసిక దారుఢ్యాన్ని పెంచుతాయని అన్నారు. సాంకేతికంగా అధునాతనంగా స్టేడియంను తయారు చేసిన కోచ్ ఎస్ఎస్ ప్రవీణ్‌ను ఆయన అభినందించారు. స్టేడియంలో ఉదయం ఐదు నుంచి రాత్రి 10 గంటల వరకు క్రీడాకారులు ఆడుకోవచ్చని, మొత్తం నాలుగు సింథటిక్ కోర్టులు అందుబాటులో ఉన్నాయని ఆయన అన్నారు.

ఇంద్రపాలెంలో రక్తదాన శిబిరం



శిబిరంలో పాల్గొన్న దాతలు, గీసాల శ్రీను

కాకినాడ రూరల్: మండలంలోని ఇంద్రపాలెంలో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఏఎంసీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ నాయకుడు గీసాల శ్రీను జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయన కుమారులు వీరబాబు, ఆనంద్ పలు సేవా కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. యువసేన బ్లడ్ బ్యాంక్ ద్వారా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో 109 మంది రక్తదానం చేశారు. పారిశుద్ధ్య కార్మికుల సమక్షంలో బర్త్‌డే కేక్ కట్ చేసిన గీసాల శ్రీను వారికి 25 కేజీల చొప్పున బియ్యం, వెయ్యి రూపాయలు విలువైన నిత్యవసర సరుకులను అందించారు.

ప్రత్యక్ష నారాయణా.. నమామ్యహం

- వైభవంగా రథసప్తమి వేడుకలు
- సూర్యభగవానుడికి వైభవంగా అభిషేకాలు
- దర్శనాల కోసం క్యూ కట్టిన భక్తకోటి



భావనారాయణస్వామి ఆలయ ప్రాంగణంలో పూజలు చేస్తున్న భక్తులు



భానుగుడి సూర్యనారాయణమూర్తి ఆలయంలో దర్శనం కోసం క్యూలో వేచి ఉన్న భక్తులు

బోట్‌క్లబ్: రథసప్తమి సందర్భంగా నగరంలో సూర్యనారాయణమూర్తి ఆలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామిని సుందరంగా అలంకరించారు. తెల్లవారుజాము నుంచే పంచామృతాభిషేకాలు నిర్వహించారు. భానుగుడి సమీపంలో భానులింగేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న సూర్యనారాయణ మూర్తి ఆలయంలో ఆలయ ప్రధాన అర్చకులు హరిప్రసాద్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. అలాగే దేవదాయశాఖ డీసీ మేడేపల్లి విజయరాజు ప్రత్యేక పూజలు చేయగా ఆలయ కమిటీ చైర్మన్ వాకాడ సత్తిబాబు ఆయనను సత్కరించారు. స్వామి దర్శనం కోసం రెండు గంటలకు పైగా నిలబడాల్సిన పరిస్థితి నెలకొంది. స్వామి వారికి డీసీ కార్యాలయ సూపరింటెండెంట్ సోమరాజు ప్రత్యేక అభిషేకాలు చేశారు. బాలత్రిపుర సుందరి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో స్వామికి ఆలయ ప్రధాన అర్చకులు చెరుకూరి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. స్థానిక సంతచెరువు మార్కెట్ సమీపంలో సూర్యనారాయణమూర్తి ఆలయంలోను భక్తులు స్వామికి అభిషేకాలు చేశారు. స్థానిక రిజర్వులైన్ అయ్యప్ప స్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న సూర్యనారాయణ మూర్తి ఆలయంలో ఆలయ పర్సన్ ఇన్‌చార్జి గోపాలకృష్ణ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. స్థానిక దేవాలయంవీధిలోని వేణుగోపాలస్వామి ఆలయంలో రథసప్తమి సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. అలాగే నగరంలో పలు ఆలయాల ప్రాంగణంలో ఉన్న సూర్యనారాయణ మూర్తి ప్రత్యేక అభిషేకాలు చేశారు.

భావనారాయణస్వామి ఆలయంలో భక్తజన సందోహం

కాకినాడ రూరల్: స్థానిక సర్పవరం రాజ్యలక్ష్మీ సమేత భావనారాయణస్వామి ఆలయంలో రథసప్తమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేలాదిగా భక్తులు పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. మహిళలు సూర్యభగవానుడికి జాజులు ఎగుర వేయగా ముత్తైదువులు కొంగులు పెట్టారు. స్వామివారి సన్నిధిలో అక్షరాభ్యాసం చేసిన వారు ఉన్నత స్థానాలకు వెళ్తారన్న ప్రగాఢ విశ్వాసంతో చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు. భక్తులు స్వామికి ప్రదక్షిణలు చేశారు. ఆలయ ధర్మకర్తమండలి సభ్యులు పుల్ల వీరవెంకటసత్యనారాయణ భక్తులకు క్షీరాన్న ప్రసాద అందజేశారు. పుల్ల చంద్రరావు చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకులు పుల్ల చందు, ఆలయ ధర్మకర్త మండలి చైర్మన్ పుల్ల నారాయణరావు, ఆలయ ఈఓ కె.విజయలక్ష్మి, కమిటీ సభ్యులు ఎల్.శ్యామలాదేవి వీరభద్రరాజు, ఘంటసాల బదరీనారాయణ, జోకా సత్తిబాబు, వాసంశెట్టి వీరలక్ష్మి, శ్రీనుల నేతృత్వంలో ఏర్పాట్లు చేశారు.

మాఘ ఆదివారానికి భారీ ఏర్పాట్లు..

మాఘమాసం రెండో ఆదివారం కావడంతో రాష్ట్రం నలుమూలల నుంచి సుమారు 25వేల నుంచి 30 వేల మంది భక్తులు స్వామిని దర్శించుకునే అవకాశం ఉందనే అంచనాతో భారీ ఏర్పాట్లు చేసినట్టు ఆలయ చైర్మన్ పుల్ల నారాయణరావు తెలిపారు.

కరపలో..

కరప: మండలంలోని గ్రామ, గ్రామాన శనివారం రథసప్తమి పూజలు నిర్వహించారు. మహిళలు చిక్కుడు కాయలతో రథం చేసి, దానిపై సూర్యభగవానుడిని ఉంచి, చిక్కుడు పూలతో అర్చనచేశారు. ఆవుపేడ వేరు పిడకలపై ఆవుపాలతో క్షీరాన్నం వండి చిక్కుడు, జిల్లేడు ఆకులలో ఉంచి స్వామివారికి నైవేద్యం సమర్పించారు.



ప్రత్యేక అలంకరణలో భానుగుడి సూర్యనారాయణమూర్తి

ఒకటి నుంచి వేంకటేశ్వర దివ్య కల్యాణోత్సవాలు



ఆలయం వద్ద పందిరి రాట ముహూర్తం చేస్తున్న అర్చకుడు, నాయకులు

కరప: మండలం యండమూరులోని సామ్రాజ్యలక్ష్మి, గోదాదేవి సమేత వెంకటేశ్వరస్వామివారి దివ్య కల్యాణం ఫిబ్రవరి ఒకటి నుంచి ఆరో తేదీ వరకు వైఖానస ఆగమ సిద్ధాంతం ప్రకారం నిర్వహించనున్నట్టు వంశపారంపర్య అర్చకులు పెద్దింటి సీతారామం తెలిపారు. వైఖానస మహదాచార్య చక్రవర్తుల వేణుగోపాలాచార్యులవారి యాజ్ఞీకంతో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు దేవదాయశాఖ ఈఓ పీవీఎస్ సూర్యనారాయణరాజు శనివారం తెలిపారు. ఆలయ అభివృద్ధి దాతలు రాజుపాలెం శ్రీవెంకటేశ్వర ట్రస్ట్, గ్రామస్తుల సహకారంతో దేవదాయశాఖ పర్యవేక్షణలో స్వామివారి కల్యాణానికి ఏర్పాట్లు చేస్తున్నట్టు ఈఓ తెలిపారు. ఈ సందర్భంగా శనివారం పందిరి రాట వేశారు.

'బాబు'ను నమ్మరనే 'కొడుకు' పాదయాత్ర



గడపగడపకు మన ప్రభుత్వంలో ప్రభుత్వ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి. చిత్రంలో కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, మాజీ మేయర్ సుంకర శివప్రసన్న తదితరులు

- రంగు మార్చినా.. జనం ఆదరించరు
- గడపగడపలో ఎమ్మెల్యే ద్వారంపూడి

కాకినాడ: ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయకుండా చివరకు మ్యానిఫెస్టోను కూడా వెబ్‌సైట్ నుంచి తొలగించిన ఘనత తెలుగుదేశం పార్టీదేనని సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. 2014 ఇచ్చిన హామీలను చంద్రబాబు తుంగలో తొక్కడంతో ప్రజల్లో నమ్మకం కలిగించడానికి ఇప్పుడు ఆయన తనయుడు లోకేష్ పాదయాత్ర ప్రారంభించారని వ్యాఖ్యానించారు. స్థానిక 8వ డివిజన్ రాజ్యలక్ష్మినగర్ ప్రాంతంలో శనివారం గడపగడపకూ మన ప్రభుత్వం నిర్వహించారు. కౌడ చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు, మాజీ మేయర్ సుంకర శివప్రసన్న, మాజీ కార్పొరేటర్లు, నాయకులు హాజరయ్యారు. స్థానికులు పలు సమస్యలను ఎమ్మెల్యేకు వివరించగా సత్వరమే పరిష్కరించాలని అక్కడే ఉన్న సంబంధిత అధికారులకు సూచించారు. అనంతరం ద్వారంపూడి మాట్లాడుతూ లోకేష్ చేపట్టిన పాదయాత్ర, ఆయన ప్రసంగం తీరు చూసి జనం విస్తుపోతున్నారన్నారు. ముఖ్యంగా నిరుద్యోగుల కోసం ప్రత్యేక మ్యానిఫెస్టో ఇస్తామంటూ లోకేష్ చేసిన వ్యాఖ్యలు హాస్యాస్పదంగా ఉన్నాయన్నారు. 2014లో జాబ్ కావాలంటే బాబు రావాలని, నిరుద్యోగ భృతి ఇస్తామని చేసిన ప్రకటనలు ఏమయ్యాయని నిలదీశారు. చివరకు మ్యానిఫెస్టోను టీడీపీ చెత్త బుట్టలో వేసిందని, అందువల్ల చంద్రబాబును ప్రజలు నమ్మే స్థితిలో లేకపోవడంతో ఇప్పుడు కొడుకు లోకేష్‌ను రంగంలోకి దింపారన్నారు. లోకేష్‌చేసే పాదయాత్రకు రంగు మారిందే తప్ప ప్రజల విశ్వాసాన్ని పొందలేదన్నారు. ఇచ్చిన హామీలను దాదాపు నెరవేర్చిన సీఎం పాలన పట్ల ప్రజల్లో పూర్తి విశ్వాసం కనిపిస్తోందని, ముఖ్యమంత్రిని మరోసారి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే ద్వారంపూడి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఆయన వెంట మాజీ డిప్యూటీ మేయర్ పసుపులేటి వెంకటలక్ష్మి, మీసాల ఉదయ్‌కుమార్, మాజీ కార్పొరేటర్లు చిట్నీడి మూర్తి, రాగిరెడ్డి బన్ని, స్థానిక నాయకులు బళ్ల సూరిబాబు, కార్పొరేషన్ కార్యదర్శి ఎం.ఏసుబాబు, ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్, టీపీఆర్వో మానే కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

పంజాబ్ కేసరి లాలా లజపతిరాయ్

కాకినాడ రూరల్: సర్పవరం జంక్షన్‌లో బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో లాలా లజపతిరాయ్ జయంతి జరిగింది. సైమన్ కమిషన్ రాకను నిరసిస్తూ చేస్తున్న ఆందోళనలో పోలీసు లాఠీచార్జీలో ఆయన తీవ్రంగా గాయపడి కొద్ది రోజులకే మరణించారని గ్రంథాలయ విశ్రాంతి ఉద్యోగి చింతపల్లి సుబ్బారావు తెలిపారు. అడబాల రత్న ప్రసాద్, రాజా, రేలింగి బాపిరాజు తదితరులు పాల్గొన్నారు.

హజరత్ ఖ్వాజా గరీబ్ నవాజ్‌కు చాదర్ సమర్పణ



గంధోత్సవంలో పాల్గొన్న బషీరుద్దీన్

కాకినాడ సిటీ: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వక్ఫ్‌బోర్డు చైర్మన్ ఖాదర్‌బాషా సూచనలపై బోర్డు డైరెక్టర్ అబ్దుల్ బషీరుద్దీన్ అజ్మీర్ షరీఫ్‌లోని హజరత్ ఖ్వాజా గరిబ్ నవాజ్ 811వ గంధోత్సవానికి ఆంధ్రప్రదేశ్ తరఫున పవిత్ర చాదర్‌ని సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతో రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, జగన్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలని కోరుకున్నట్లు వివరించారు. బషీరుద్దీన్‌తో కలిసి మొహమ్మద్ ఫరూక్ అలీబర్కత్ అలీ తదితరులు పాల్గొన్నారు.

స్టాటస్టిక్స్ విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు విస్తృతం



సదస్సులో మాట్లాడుతున్న సీటీఓ త్రినాథ్

బాలాజీచెరువు: స్టాటస్టిక్స్ విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు విస్తృతంగా ఉంటాయని సిటీ ప్లానింగ్ ఆఫీసర్ పి.త్రినాథ్ పేర్కొన్నారు. ఆదిత్య డిగ్రీ కళాశాలలో శనివారం స్టాటస్టిక్స్ విభాగం ఆధ్వర్యంలో సినర్జియా-2022 సదస్సు నిర్వహించారు. త్రినాథ్ మాట్లాడుతూ స్టాటస్టిక్స్ విద్యార్థులకు కేంద్ర, రాష్ట్రాల్లో పలు ప్రైవేట్ సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయన్నారు. పలు పోటీల్లో ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల అకడమిక్ డైరెక్టర్ బీఈవీఎల్ నాయుడు, ఏఎస్ఓ సుదర్శన్, వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి



పండూరు లే అవుట్ మ్యాప్‌ను పరిశీలిస్తున్న నగరపాలక సంస్థ కమిషనర్ రమేష్

కాకినాడ రూరల్: నగరపాలక సంస్థ కమిషనర్ కె.రమేష్ శనివారం పండూరు-1 లేఔట్‌ను సందర్శించారు. నగరపాలక సంస్థ పరిధిలోని 1, 2, 3 డివిజన్లకు సంబంధించి 1086 మంది లబ్ధిదారులకు ఇక్కడ ఇళ్ల స్థలాలు కేటాయించారు. ఇళ్ల నిర్మాణ ప్రగతి పర్యవేక్షణకు గ్రామీణ నీటి సరఫరా, విద్యుత్, హౌసింగ్, నగరపాలక సంస్థ అధికారులతో కలసి కమిషనర్ లేఔట్‌ను పరిశీలించారు. కమిషనర్ రమేష్ మాట్లాడుతూ పండూరు లే అవుట్‌లో ఇతర సదుపాయాలకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు చేసినట్టు తెలిపారు. సుమారు 800 మంది ఇళ్ల నిర్మాణానికి ఆమోద పత్రాలు ఇచ్చారన్నారు. ఉగాది నాటికి కనీసం 50 ఇళ్లు పూర్తి చేసి గృహప్రవేశాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట గ్రామీణ నీటి సరఫరా విభాగం ఈఈ చౌదరి, కాకినాడ నగరపాలక సంస్థ డీఈ ఎం. వెంకట్రావు, టీపీఆర్ఓ మానే కృష్ణమోహన్, ఏఈ రమేష్, హౌసింగ్ ఏఈ బాషా తదితరులు పాల్గొన్నారు.

సమస్యారహిత నగరమే లక్ష్యం

- సిటీ ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి
- రూ.1.4 కోట్లతో అభివృద్ధి పనులు



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి తదితరులు

కాకినాడ: సమస్యలు లేని నగరంగా కాకినాడను తీర్చిదిద్దడమే లక్ష్యమని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. 12వ డివిజన్‌లో రూ.1.4 కోట్లతో ప్రతిపాదించిన రహదారులు, డ్రైనేజీల నిర్మాణానికి ఆయన శనివారం శంకుస్థాపన చేశారు. కౌడ చైర్ పర్సన్ రాగిరెడ్డి చంద్రకళ దీప్తి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు, మాజీ మేయర్ సుంకర శివప్రసన్న, నగరపాలక సంస్థ కమిషనర్ కె.రమేష్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ద్వారంపూడి విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల డివిజన్‌లో గడప గడపకూ పర్యటనల సందర్భంగా వచ్చిన అనేక అంశాలను పరిష్కరించేందుకు ప్రతిపాదనలు చేసి శంకుస్థాపనలు చేసినట్టు తెలిపారు. 12వ సచివాలయం-బి పరిధిలో మరో రూ.కోటిన్నరతో ప్రతిపాదన సిద్ధం చేశామన్నారు. ఇప్పటికే మార్కెట్ నిర్మాణానికి శంకుస్థాపన చేశామని, కమ్యూనిటీ హాల్ నిర్మిస్తున్నామని, అపరిష్కృతంగా ఉన్న శ్మశాన వాటిక నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు. రానున్న నెల రోజుల్లో 12వ డివిజన్‌ను అన్ని విధాలా అభివృద్ధి చేసి సమస్యల లేకుండా తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు. మాజీ డిప్యూటీ మేయర్ పసుపులేటి వెంకటలక్ష్మి, స్థానిక నాయకులు మట్టపర్తి రఘురామ్, మెర్ల వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో ఫిజియోథెరపీ సేవలు



రోగికి వైద్యం చేస్తున్న ఫిజియోథెరపిస్టు

కరప: స్థానిక పీహెచ్‌సీలో శనివారం పెనుగుదురు సంధ్య ఫిజియోథెరపీ కళాశాల విద్యార్థులు సేవలు అందించారు. డాక్టర్ ఆర్.శ్రీనివాసనాయక్ మాట్లాడుతూ ఫిజియోథెరపీ అనేది మందులు అవసరం లేని చికిత్సా విధానమన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కాంతిరాజ్ మాట్లాడుతూ ఫిజియో థెరపీ ద్వారా ఎముకలు, కండరాలు, కీళ్లనొప్పులు, పక్షవాతం, అంగవైకల్యం వంటి ఎన్నో వ్యాధులను నయం చేయవచ్చన్నారు. కళాశాల కార్యదర్శి డాక్టర్ బి.శివశిరీష, డైరెక్టర్ బి.భరత్‌రెడ్డి, పీహెచ్‌సీ డాక్టర్ ఎ.ఆశ, సీహెచ్‌ఓ వై.రత్నకుమారి, ఎంపీహెచ్‌ఓ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

తాళ్లరేవు సమితి మాజీ అధ్యక్షుడు పబ్బినీడి కన్నుమూత



పబ్బినీడి సత్యనారాయణ(ఫైల్)

కరప: మండలంలోని గురజనాపల్లి మాజీ సర్పంచ్, తాళ్లరేవు సమితి మాజీ అధ్యక్షుడు, పెనుగుదురు పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు, డీసీసీబీ మాజీ డైరెక్టర్ పబ్బినీడి సత్యనారాయణ (78) శనివారం కన్నుమూశారు. కొంతకాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు. మూడురోజుల క్రితం బాత్‌రూమ్‌లో పడిపోతే కాకినాడ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ, పరిస్థితి విషమించడంతో మృతిచెందారు. ఆయన ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు పాపారావు వైఎస్సార్‌సీపీ నాయకుడు. 1965లో 21వ ఏట ఓటుహక్కు రాగానే పంచాయతీ ప్రెసిడెంట్‌గా పోటీచేసి ఏకగ్రీవంగా ఎన్నికై పదేళ్లపాటు పనిచేశారు. 1979లో తాళ్లరేవు సమితి ప్రెసిడెంటుగా స్వంత్ర అభ్యర్థిగా పోటీచేసి గెలిచారు. 1982లో టీడీపీలో చేరారు. గ్రామంలో హైస్కూలు రెండు ఎకరాలు ఇచ్చి, ఉన్నతపాఠశాల వచ్చేలా చేశారు. 1992-95, 2005-12 మధ్య కాలాల్లో పెనుగుదురు పీఏసీఎస్ అధ్యక్షుడిగా సేవలందించారు. ఆయన మృతికి సంతాపంగా గ్రామంలోని పాఠశాలలు, దుకాణాలు బంద్ పాటించాయి. ఎమ్మెల్యే కురసాల కన్నబాబు గరజనాపల్లి వెళ్లి సత్యనారాయణ పార్థివ దేహానికి నివాళులర్పించి, కుమారుడు పాపారావును, కుటుంబసభ్యులను పరామర్శించారు. జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, సర్పంచ్ అనసూరి శ్రీనివాసరావు వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు నివాళులర్పించారు.



గురజనాపల్లిలో పబ్బినీడి సత్యనారాయణ భౌతిక కాయం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

ఆదిత్య విద్యార్థికి అభినందన



మనోజ్ కుమార్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రమేష్

కాకినాడ రూరల్: సూరంపాలెం ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల ఫైనలియర్ విద్యార్థి మనోజ్‌కుమార్ బెంగళూరుకు చెందిన టుడో సంస్థలో ప్లేస్‌మెంట్ సాధించాడు. రమణయ్యపేట వద్ద 'పర్పుల్ లేన్ కార్యాలయం'లో శనివారం జరిగిన కార్యక్రమంలో అయన మాట్లాడుతూ మనోజ్ ఈ కార్యాలయంలో శిక్షణ పొంది ప్లేస్‌మెంట్ సాధించాడని చెప్తూ అతనిని అభినందించారు. పర్పుల్‌లేన్‌కు చెందిన సంతోష్, మనోజ్, వి.వినోద్‌లను ప్రిన్సిపాల్ అభినందించారు.

పెండింగ్ కేసులు పరిష్కరించాలి



మాట్లాడుతున్న మూడో అదనపు జిల్లా జడ్జి కమలాదేవి. చిత్రంలో న్యాయమూర్తులు

కాకినాడ లీగల్: వచ్చేనెల 11న జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌లో పెండింగ్ కేసుల పరిష్కారానికి సమన్వయంతో కృషి చేయాలని కాకినాడ మూడో అదనపు జిల్లా జడ్జి, మండల న్యాయ సేవాధికార కమిటీ చైర్మన్ పి.కమలాదేవి అన్నారు. స్థానిక కోర్టులో శనివారం బీమా కంపెనీ అధికారులు, న్యాయవాదులతో సమావేశం నిర్వహించి కేసుల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. పోక్సో కోర్టు న్యాయమూర్తి ఎల్.వెంకటేశ్వరరావు, నాలుగో అదనపు జిల్లా జడ్జి ఎం.హరినారాయణ, ఆరో అదనపు జిల్లా జడ్జి ఆర్‌వీ నిఖిత పాల్గొన్నారు.

వీనుల విందుగా గాత్ర కచేరీ



కీర్తనలు అలపిస్తున్న కృష్ణ తదితరులు

కాకినాడ కల్చరల్: ప్రముఖ సంగీత విద్వాంసుడు టీఎస్ఎస్ కృష్ణ గాత్ర కచేరీ వీనుల విందుగా సాగింది. సంగీత విద్వత్సభ ఆధ్వర్యంలో సూర్య కళామందిర్‌లో 75 వ సంక్రాంతి వార్షికోత్సవాలు నిర్వహిస్తున్నారు. హంసధ్వని రాగంలో వాతాపి..., షణ్ముఖప్రియ రాగంలో మరివేరె..., శంకరాభరణం రాగంలో రాగసుధ.. తదితర కీర్తనలు ఆలపించారు. వీరికి వయోలిన్ విద్వాంసులు బీవి రాఘవేంద్రరావు, మృదంగం విద్వాంసులు కె.సద్గుర్ చరణ్, కంజర విద్వాంసుల కె.శ్రీనివాస్ వాద్య సహకారం అందించారు. సభాధ్యక్షుడు నారాయణం మురళి, కార్యదర్శి వక్కలంక రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గూడ్స్ షెడ్ తనిఖీ



గూడ్స్ షెడ్ సిబ్బందితో మాట్లాడుతున్న పీసీసీఎం జాన్ ప్రసాద్

కాకినాడ సిటీ: దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్ పీసీసీఎం జి.జాన్ ప్రసాద్ శనివారం కాకినాడ గూడ్స్ షెడ్‌ను తనిఖీ చేశారు. సిబ్బంది, కార్మికులతో కొద్దిసేపు ముచ్చటించారు. సీపోర్టు, కోరమాండల్ ఫెర్టిలైజర్స్, నాగార్జున ఫెర్టిలైజర్స్‌లో గూడ్స్ రైల్‌లో ఎగుమతులపై వారు తీసుకుంటున్న భద్రతా ఏర్పాట్లును సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. గూడ్స్ షెడ్‌లో పని చేస్తున్న సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డీసీఎం జి.సోమశేఖర్‌నాయుడు, ఏఓ వినాయకంత్, సంతోష్‌కుమార్, సిహెచ్ స్వామిరాజశేఖర్ తదితరులు ఈ తనిఖీల్లో పాల్గొన్నారు.

చంద్రశేఖర్‌కు సత్కారం



పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ చంద్రశేఖర్‌ను సత్కరిస్తున్న దృశ్యం

కాకినాడ రూరల్: లక్షలాది మందికి ఉచితంగా నేత్ర చికిత్సలు అందించి వారిలో వెలుగులు నింపిన పద్మశ్రీ పురస్కార గ్రహీత సంకురాతిరి చంద్రశేఖర్ ను అడబాల ట్రస్ట్ సత్కరించింది. కిరణ్ కంటి ఆస్పత్రిలో జరిగిన కార్యక్రమంలో ప్రముఖ దంత వైద్యుడు డాక్టర్ అడ్డాల సత్యనారాయణ మాట్లాడుతూ 30 ఏళ్లుగా ఆయన చేస్తున్న కృషికి గుర్తింపుగా పద్మశ్రీ పురస్కారం రావడం గర్వకారణం అన్నారు. చంద్రశేఖర్ మాట్లాడుతూ పద్మశ్రీ పురస్కారం తన బాధ్యతను మరింత పెంచిందన్నారు. అడబాల రత్నప్రసాద్, ఎస్. శ్రీనగేష్, డాక్టర్ శిరీష తదితరులు పాల్గొన్నారు.